క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



ముంచంగిపుట్టులో విద్యార్థులకు జరుగుతున్న ఆటల పోటీలు

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–1లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ స్పోర్ట్స్, గేమ్స్ పోటీలను హెచ్‌ఎం మాణిక్యాలరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. పోటీల్లో మండలంలో 12 పాఠశాలల నుంచి 210 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. బాయ్స్–2 పాఠశాల హెచ్‌ఎం సత్యారావు, మండల కో–ఆర్డినేటర్ ధనుంజయ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ పాపినాయుడుకు అభినందనలు



ఎస్‌ఐ పాపినాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: మండలంలో ఇటీవల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన కె.పాపినాయుడును సాగర పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు దేవదాజు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు గురువారం కలిశారు. ఎస్‌ఐను వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి అడ్డుకట్టకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌ఐను కోరినట్టు వారు చెప్పారు. నాయకులు కృష్ణారావు, సింహాచలం, అశోక్, అరకు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నరసింగరావు తదితరులున్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



పాతబస్టాండ్ వద్ద వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని పాతబస్టాండ్‌లోని కొలువుదీరిన వరసిద్ధి వినాయక ఆలయ ప్రాంగణంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానికుడు డోకుపర్తి రామకృష్ణ సహకారంతో గురువారం జరిగిన భారీ అన్న సమరాధనకు స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పసుపులేటి బాలరాజు, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహచలంనాయుడు, రమాదేవి దంపతులు, భక్తులు గణనాథున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు .అనంతరం మాజీ మంత్రి పసుపులేటి బాలరాజును డోకుపర్తి కుటుంబంతో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులంతా ఘనంగా సన్మానించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



కడుతులలో ట్యాంకు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నొయిన, ఎంపీటీసీ కమల, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామంలో జేజేఎం నిధులు రూ.6.40 లక్షలతో తాగునీటి పథకం ఏర్పాటుకు, ట్యాంక్ నిర్మాణ పనులకు సర్పంచ్ జనం నోయిన, ఎంపీటీసీ సభ్యురాలు కమల గురువారం శంకుస్థాపన చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల్లోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పలు గ్రామాల్లో తాగునీటి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరావు రఘురాం, నీలాంబరం, వార్డు మెంబర్ ముక్త తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మోక్షమెన్నడో?

- కమలమంధ, సాగిరివలస గ్రామాల్లో అధ్వానంగా రహదారులు
- కోతకు గురైన రోడ్లు.. చినుకుపడితే చిత్తడే
- గ్రామస్తుల అవస్థలు



చిత్తడిగా మారిన రహదారి



కమలబంధ- సాగిరివలసలో వర్షాలకు కోతకు గురైన రోడ్డుపై గ్రామస్తుల రాకపోకలు

డుంబ్రిగుడ: మండలంలోని చాలా గ్రామాలకు రహదారుల నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా నేటి వరకు పనులు ప్రారంభించలేదు.. కొన్ని చోట్ల పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామాలకు సరైన రహదారి లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కమలబంధ నుంచి సాగిరివలస మధ్య గ్రావెల్ రోడ్డు నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.49లక్షలు మంజూరైంది. ఈ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ అప్పుడప్పుడు పనులు చేస్తు మధ్యలో పనులు నిలిపివేస్తున్నారు. దీనిపై పలుమార్లు కాంట్రాక్టర్‌ను కమలబంధ, సాగిరివలస గ్రామస్తులు ప్రస్తావించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రోడ్డుపై మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డు అంత బురదగా మారిందంటున్నారు. ఈ మార్గంలో పూర్తిగా గ్రావెల్ వేసి రవాణాకు సౌకర్యం కల్గించేలా చూడాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మోక్షం కలగడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే అంబులెన్స్ రావడానికి వీలు లేకుండా ఉందని, అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను వారపుసంతలకు తరలించాలన్నా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం డుంబ్రిగుడ పరిధిలో, అత్యవసర పరిస్థితుల్లో అరకులోయ ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తే కాలినడకే శరణ్యం అవుతుందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ గ్రామంలోనే రహదారి పనులు, ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని చెబుతున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



రోడ్డు పనులు చేపట్టాలని కోరుతూ ఆందోళన చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

పనులు త్వరగా పూర్తి చేయాలి



రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి పూర్తిచేయాలి. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే అంబులెన్స్ రావడానికి వీలు లేకుండా ఉంది. సంతలకు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకెళ్లి విక్రయించేందుకు అవకాశం లేదు. ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడక శరణ్యంగా మారింది. మంజూరైన రోడ్డులో సమస్యతో పాటు డ్రైనేజీ సమస్యలు తీర్చాలి.

– వంతాల గురునాయుడు, కమలబంధ గ్రామం, సొవ్వ పంచాయతీ

ప్రతిపాదనలు పంపుతాం



ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలుచోట్ల రహదారులు దెబ్బ తిన్నాయి. ఇందులో భాగంగా కమలబంధ నుంచి సాగిరివలస రహదారితో పాటు వివిధ ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. నష్టాలను అంచనా వేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– ఉషారాణి, ఎంపీడీవో, డుంబ్రిగుడ

భక్తిశ్రద్ధలతో గణనాథుని నిమజ్జనం



కొయ్యూరులో గణపతి విగ్రహం ఊరేగింపు



రాజవొమ్మంగిలో గణనాథుని విగ్రహ ఊరేగింపులో భక్తులు

కొయ్యూరు: వినాయకుని నిమజ్జనంలో భాగంగా శోభాయాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. కొయ్యూరు, రాజేంద్రపాలెంకు చెందిన వినాయకుని విగ్రహాలను ఊరేగింపుగా చేపట్టారు. కొయ్యూరు, రాజేంద్రపాలెంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. పలువురు గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన గణనాథునికి గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. డప్పువాయిద్యాల నడుమ యువతీ యువకులు డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. దారి పొడవునా ప్రసాదవితరణ గావించారు. పోలీసులు గట్టి బందోబస్తే ఏర్పాటు చేశారు.

జిల్లా ఫార్మసీ సంఘం ఎన్నిక

జి.మాడుగుల: జిల్లా ఫార్మసీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు జి.మాడుగులలో గురువారం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బచ్చలి కామేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కొర్రా లక్ష్మణరావు, కె మోహన్‌దాస్, కార్యర్శిగా పాంగి రాజుబాబులను ఎన్నికయ్యారు. జిల్లా మహిళా సాధికారత అధ్యక్షురాలుగా అన్నపూర్ణ, లలిత, లావణ్య, జ్యోతి, కనకలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫార్మసీ వృత్తిలో ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా తమ వంతు కృషి చేస్తానని నూతన జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరావు తెలిపారు. బాధ్యతలు అప్పగించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్, మహిళా సాధికారత అధ్యక్షురాలు పద్మావతి మోహన్‌దాస్, శ్రావణ్ కుమార్‌కు నూతన కార్యవర్గం ధన్యవాదాలు తెలియజేశారు.

పోషకాహారం అవసరం



గంగవరంలో చిన్నారికి అక్షరాభ్యాసం చేస్తున్న సీడీపీవో లక్ష్మీ తదితరులు



ఏకలవ్య పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో విజయగౌరి, ప్రిన్సిపాల్ దిలీప్‌సింగ్

గంగవరం : మర్రిపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని ఇ.రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో సీహెచ్.లక్ష్మి , ఎండపల్లి సర్పంచ్ రామలక్ష్మి , సూపర్వైజర్ సత్యవతి హాజరయ్యారు. సీడీపీవో మాట్లాడుతూ పోషకాహార ప్రాముఖ్యతను, చిరు ధాన్యాల ప్రాముఖ్యతను గురించి, రక్తహీనత గురించి పోషకాహారం తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు అంగ్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పోషకాహారం సక్రమంగా అందుతుందో లేదో వారిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ రామలక్ష్మి చేతుల మీదుగా సీమంతాలు నిర్వహించారు. ప్రీస్కూల్ తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకట రమణ,

చింతూరు: మండలంలోని లక్కవరం ఏకలవ్య పాఠశాలలో గురువారం జరిగిన పోషణ మాసోత్సవం కార్యక్రమంలో సీడీపీవో విజయగౌరి మాట్లాడుతూ కిశోర బాలికలకు కౌమార దశలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని, జాగ్రత్తగా ఉంటూ పోషకాహారం తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి పాఠశాలలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ దిలీప్‌సింగ్, గోపాలకృష్ణ, ఐసీడీఎస్ సిబ్బంది రాజు, సత్యవతి, సంఘమిత్ర, ప్రియాంక, పార్వతి, అలేఖ్య పాల్గొన్నారు.

మెనూ అమలుచేయాలి



రింతాడ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి బాలసుందరంబాబు

గూడెంకొత్తవీధి: రింతాడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల వసతిగృహాన్ని మండల ప్రత్యేకాధికారి, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరం బాబు గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమాల్లో విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. భోజన నాణ్యతను పరిశీలించారు.రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అడ్డతీగల: రాష్ట్రస్థాయి పుట్‌బాల్ అండర్–17 లెవెల్ పోటీలకు అడ్డతీగల మండలం వేటమామిడిలోని హోసన్నా ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల డీన్ ధన సందీప్, ప్రిన్సిపాల్ మృదుహాసిని మాట్లాడుతూ ఈ నెల 18 న కాకినాడలో జరిగిన పుట్‌బాల్ అండర్–17 పోటీల్లో తమ స్కూల్‌కు చెందిన వాస అభిషేక్, కూనేటి శ్రీను, చెదల విజయ విశేష ప్రతిభ కనబరిచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను, పీఈటీ సుందర్ తదితరులు అభినందించారు.

బండారగూడెంలో రహదారికి మరమ్మతులు



బండారు గూడెం రహదారికి మరమ్మతులు చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కూనవరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని బండారు గూడెం రహదారి కోతకు గురై అధ్వానంగా మారింది. ఈ సమస్యను గ్రామ పెద్దలు ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బాలస్వామి దృష్టికి తీసుకు వెళ్లడంతో తక్షణం స్పందించిన ఆయన గురువారం రెండు కిలోమీటర్లు పైగా రహదారి మరమ్మతులు చేయించారు. ట్రాక్టర్‌తో కంకర, మెటల్ తెచ్చి గోతులు పూడ్చి, చదును చేయించారు. సమస్యను తెలియ జేసిన వెంటనే స్పందించి పరిష్కరించిన బాలస్వామికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ట్రస్ట్ సభ్యులు చిచ్చడి రాజేష్, మీసాల మహేంద్ర, సోమరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గిరిజనుడి మృతి



వైకుంఠరావు (ఫైల్)

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీలో బారికుగా ఉన్న కమ్మిడి వైకుంఠరావు(55) బుధవారం రాత్రి మృతి చెందారు. పంచాయతీ పరిధిలోని 12 గ్రామాల్లో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలిగిన బారికుకు సమాచారం అందిస్తే అతను అధికారులకు, అనంతరం ప్రజలకు సమాచారం చేరదీసేవారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. గ్రామ ఉద్యోగులు దహన సంస్కరణకు నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. ఆర్థిక సాయమందించిన వారిలో చిన్నబాబు, సత్యనారాయణ, త్రినాథరావు, రవీంద్ర, బాలకృష్ణ, సంజీవ్, పండు తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందజేయాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాలు అందజేయాలని, మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని మారుమూల బస్కీ పంచాయతీలో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్కీ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. వంట గదికి వెళ్లి విద్యార్థులకు వండుతున్న భోజనాలను పరిశీలించారు. పాఠశాల తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఛిద్రమైన రహదారులను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు అరకులోయ నుంచి బస్కీ వరకు రహదారి ఛిద్రమైందని, రహదారి మరమ్మతు పనులు జరుగుతున్నాయని, త్వరలో ఆ పనులు పూర్తయితే ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్ పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సీతమ్మ, నేతలు, అధికారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రైతులకు రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ అరిసెల సీతమ్మ తదితరులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో శ్రీనివాస బాబు మాట్లాడుతూ మండలంలో 18 రైతు సేవ కేంద్రాల ద్వారా 296 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో కిరణ్ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ ఔదార్యం



జమాల్‌ఖాన్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

చింతూరు: స్థానిక ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ తన ఔదార్యాన్ని మరోసారి చాటుకున్నారు. జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక శబరినది వంతెనపై లైట్లు వేయించారు. దశాబ్దాలుగా చింతూరు శబరినది వంతెనపై లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో చీకట్లో ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడ్డారు. దీంతో పాటు వరదల సమయంలో వంతెన దిగువనున్న శబరిఒడ్డు వాసులు వంతెనపై తలదాచుకుంటారు. లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో వంతెనపై వీరు చీకట్లో గడపాల్సిన పరిస్థితి నెలకొంది. వరదల సమయంలో వంతెనపై కుటుంబాలతో చీకట్లో గడుపుతున్నామని, లైట్లు వేయించాలని వారు జమాల్‌ఖాన్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే రెండు రోజుల్లో రూ.2 లక్షల వ్యయంతో వంతెనపై లైట్లు వేయించి దశాబ్దాల కలను నెరవేర్చారు. వంతెనపై లైట్లు వేయించి చీకటి కష్టాలను తొలగించిన జమాల్‌ఖాన్‌ను శబరిఒడ్డు వాసులతో పాటు దళితసంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ఎటపాక: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం వస్తుందని నెల్లిపాక పీహెచ్‌సీ పీహెచ్‌ఎన్ అరుంధతి అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం నెల్లిపాకలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా పరిసరాల ,వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో, 108, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పడాల సేవలు శ్లాఘనీయం



అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి పడాల మృతికి సంతాపం తెలుపుతున్న ఎస్‌ఐ అప్పలరాజు తదితరులు

అడ్డతీగల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు సేవలు శ్లాఘనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. స్థానిక పోలీసుస్టేషన్ గురువారం జరిగిన కార్యక్రమంలో ఎదుట అల్లూరి విగ్రహం, పడాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి చరిత్ర పరిరక్షణ, చారిత్రిక ప్రాంతాల పునరుద్ధరణ వంటి అంశాలపై పడాల వీరభద్రరావు చేసిన సేవలను ప్రస్తుతించారు. అనంతరం పడాల మృతికి సంతాపం తెలియజేశారు. ఎస్‌ఐ అప్పలరాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నేతలు సత్తిబాబు, సుబ్బారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



గంగవరంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు తదితరులు

గంగవరం : యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న పది మంది ఉపాధ్యాయులకు మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ముగ్గురు అవార్డు గ్రహీతలకు గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన గురుపూజోత్సవాలు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని యూటీఎఫ్ ఘనంగా నిర్వహించింది. మండల పరిషత్ పర్యవేక్షకులు సిద్దేశ్వరరావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, ఆర్.వి.వి.సత్యనారాయణ, బాలరాజు, యూటీఎఫ్ జిల్లా నాయకులు కె.కృష్ణ, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు రుక్మిణీదేవి, లక్ష్మి , రాంబాబు తదితరులు ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లా అవార్డు గ్రహీతలు రాధాకుమారి, రఘుబాబు, బాలరాజు , మండల అవార్డు గ్రహీతలు వై.లక్ష్మి, పి.నాగమణి, గణపతి, టి.శ్రీనివాసరావు , బి.వి.సత్యనారాయణ, వై.సత్యనారాయణ, పాపారావు, నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, వీడీ జాన్సన్, భారత తదితరులకు శాలువాలు కప్పి పూలదండలతో ఘనంగా సత్కరించారు.ఉపాధ్యాయుని వంశీప్రియ వ్యాఖ్యాతగా వ్యహరించారు. వెంకన్నదొర, విజయలక్ష్మి రామకృష్ణారెడ్డి, బొజ్జిదొర, రాంబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీతలు యూటీఎఫ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

నష్టపరిహారం ఇవ్వాలని వినతి

కూనవరం: వరదలు, వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు తహసీల్దార్ నాగబాబుకు గురువారం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, గోదావరి వరదలకు వరి, మిర్చి, పత్తి పంటలు దెబ్బతిన్నాయని, పొలాల్లో ఇసుక మేటలతో పాటు పంటలు కొట్టుకుపోయాయని తెలిపారు. తక్షణమే దెబ్బతిన్న పంటలను సర్వే చేసి బాధిత రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్పంచ్‌లు నాగమణి, వెంకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు అమ్మాజి, నాయకులు సీతారామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

డుంబ్రిగుడ: మండలంలోని అరకు గ్రామ పంచాయతీ నేరుడువలస, పాత పోలీసు స్టేషన్ దగ్గర ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందని, ఇక్కడ చేపడుతున్న అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు డొంబులు డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్–516ఈ రోడ్డు ప్రక్కన ప్రభుత్వ స్థలం అక్రమణకు గురవుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొంతమంది గిరిజనేతరులు బినామీ పేర్లతో భవనాలు నిర్మించి, 1/70 చట్టాన్ని తూట్లు పొడుస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

గిరిజన ప్రాంత అభివృద్ధిలో ప్రభుత్వం విఫలం



అరకులోయలో పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్సయ్య

అరకులోయ టౌన్: మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో సీపీఎం జిల్లా స్థాయి సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్సయ్య మాట్లాడుతూ గిరిజన ప్రాంతాభివృద్ధిలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. గ్రామాల్లో సరైన రహదారులు లేక అంబులెన్స్ సౌకర్యం లేక నేటికీ డోలీమోతలు తప్పడం లేదని, దీనిపై ప్రభుత్వం, పాలకులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన ప్రాంతాభివృద్ధి సీపీఎం తోనే సాధ్యమన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిల్లో సురేంద్ర పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి చిన్నయ్యపడాల్, అనంత గిరి జెడ్పీటీసీ గంగారాజు, నాయకులు ఉమామహేశ్వరరావు, రామారావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.